క్లుప్తంగా...

పేదలను ఆదుకోవాలి



రాంరస్ కార్యక్రమంలో పాల్గొన్న పంకజ్‌కుమార్ అగర్వాల్

చార్మినార్: పేదలను ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలని కుంభ మేళా అగర్వాల్ బంధు, అశోక్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పంకజ్‌కుమార్ అగర్వాల్ అన్నారు. రాంరస్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రికాబ్‌గంజ్‌లో తమ సంస్థ ఆధ్వర్యంలో దాహార్తులకు పానీయాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. అవసరమైన పేదలను ఆదుకోవడానికి తమ సహాయ సహకారాలు అందజేయాలన్నారు.

గుడిమల్కాపూర్‌లో వేగంగా అభివృద్ధి పనులు



పనులను పరిశీలిస్తున్న బీజేపీ నాయకుడు దేవర వంశీ తదితరులు

గోల్కొండ: గుడిమల్కాపూర్‌లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. ఆదివారం ఆయన డివిజన్ పరిధిలో జరుగుతున్న డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దివంగత దేవర కరుణాకర్ మృతి చెందిన కూడా తాము ఆయన ఆశయ సాధన కోసం కలిసికట్టుగా ముందుకు సాగుతున్నామన్నారు. దీని కోసం నిరంతరం బస్తీలలో పర్యటిస్తు స్థానికులను కలుసుకొని వారి సమస్యలను తెలుసుకుంటున్నామన్నారు. నాయకులు ప్రభు పూజారీ, మురళీకృష్ణ తదితరులున్నారు.

యువత ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించాలి



విజేతకు ట్రోఫీని అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ ఆలె జితేంద్ర

గౌలిపురా: ఆలె నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం ఆలె నరేంద్ర మెమోరియల్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఆదివారం రాహుల్ సీసీ టీమ్, వీఆర్ 46 టీమ్‌ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగగా.. రాహుల్ సీసీ టీమ్ విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన రాహుల్ సీసీ టీమ్‌కు గౌలిపురా డివిజన్ మాజీ కార్పొరేటర్, సీనియర్ నాయకులు ఆలే జితేంద్ర ట్రోఫీతో పాటు రూ.5,555ల నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా ఆసక్తి గల రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో సుమన్ కుమార్‌ముదిరాజ్, సునీల్, శ్రీకాంత్, నితీష్, జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆషూర్‌ఖానా మరమ్మతులకు నిధులు కేటాయించాలి



సమావేశంలో మీర్ అబ్బాస్ అలీ మూస్వి తదితరులు

శాలిబండ: మొహర్రం పీర్ల పండగను ప్రభుత్వం స్థాయి కార్యక్రమం వల్లే నిర్వహించాలని సీఎం కేసీఆర్‌ను అంజుమన్-ఏ-ముతవల్లియన్ అధ్యక్షుడు మీర్ అబ్బాస్ అలీ మూస్వి డిమాండ్ చేశారు. హుస్సేనీఆలంలోని బాద్‌షాహీ ఆషూర్ ఖానాలో ఆదివారం అంజుమన్-ఏ-ముతవల్లియన్ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బతుకమ్మ పండగ, ఇతర పండుగలకు కేటాయించిన మాదిరిగానే మొహర్రం సందర్భంగా ఆషూర్‌ఖానాల మరమ్మతులు, పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మొహర్రం సంస్మరణ వేడుకలకు ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ.. రాష్ట్ర పండగగా ప్రకటించలేదన్నారు. ఈ కార్యక్రమంలో బాద్‌షాహీ ఆషూర్‌ఖానా ముతవల్లీ, అధ్యక్షుడు మీర్ అబ్బాస్ అలీ మూస్వి, కార్యవర్గ సభ్యులు సయ్యద్ అబ్దుల్ ఖదీర్, మీర్ హైదర్ అలీ మూస్వి, ఖాసిఫ్ అలీ, అతీఫ్ అలీ, సయ్యద్ అజ్హర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీలో మారని తీరు!

చికెన్, మాంసం దుకాణాలకు వెళ్తే టిఫిన్ బాక్స్‌ల మాటేమాయే..?

- పట్టించుకోని చిరు వ్యాపారులు, వినియోగదారులు
- ఆశించిన ఫలితాలివ్వని 50 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్ కవర్ల వినియోగ నిషేధం



చార్మినార్: చికెన్, మాంసం దుకాణాలకు వెళితే టిఫిన్ బాక్స్‌లు తీసుకెళ్లి తమకు కావాల్సిన వాటిని వెంట తెచ్చుకోవాలని గతంలో అధికారులు చేసిన విన్నపాన్ని పాతబస్తీ ప్రజలు విస్మరించారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించాలని అప్పటి బల్దియా కమిషనర్ సూచించిన విధంగా కొద్ది రోజులు కొంత మంది పాటించినప్పటికీ.. రాను రాను పూర్తిగా మరిచిపోయారు. అవే పాత పద్ధతిలో ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారు. కేవలం పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ తప్పా.. అంతటా పాత పద్ధతిలోనే ప్లాస్టిక్ కవర్ల వినియోగం జరుగుతోంది. పాతబస్తీలోని వివిధ వ్యాపార సంస్థల యజమానులు, వ్యాపారస్తులు, వినియోగదారులు ఇంకా పాత పద్ధతిలోనే ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారు. ఎక్కడా జీహెచ్ఎంసీ నిబంధనలు పాటించడం లేదు. ఒకరకంగా చెప్పాలంటే పాతబస్తీలో ప్లాస్టిక్ కవర్ల వినియోగ నిషేధం అమలు కావడం లేదు. జీహెచ్ఎంసీ అమలులోకి తెచ్చిన 50 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్ కవర్ల వినియోగ నిషేధం పాతబస్తీలో ఆశించిన ఫలితాలివ్వడం లేదు.

పాతబస్తీలో కనిపించని మార్పులు..

పాతబస్తీలో ఎలాంటి మార్పులు కనిపించడం లేదు. ఇక్కడి వ్యాపారుల్లో చలనం రావడం లేదు. గతంలో జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్‌లోని సంబంధిత సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్‌లు, ఏఎంహెచ్‌ఓలతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అవసరమైన మేరకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. మార్కింగ్ వాకర్స్‌తో కలిసి ప్లాస్టిక్ వినియోగంపై చర్చా వేదికలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి నిబంధనలు పాటించని వ్యాపారస్తులను కట్టడి చేసారు. అవసరమైన మేరకు పెద్ద మొత్తంలో ఫలానాలు విధించారు. వారం, పది రోజుల అనంతరం మళ్లీ పాత ప్లాస్టిక్ కవర్లే వినియోగిస్తున్నారు. మీరాలంమండి, పురానాపూల్, బహదూర్‌పురా, ఫలక్‌నుమా, ఈదిబజార్, సంతోష్‌నగర్, లాడ్‌బజార్, శాలిబండ, పత్తర్‌గట్టి, గుల్జార్‌హౌస్, మదీనా, చార్‌కమాన్, చార్మినార్, చౌక్, ఖిల్వత్, లాల్‌దర్వాజా మోడ్ తదితర ప్రాంతాల్లోని వ్యాపారులు 50 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారు.

పని ఒత్తిడి కారణంగా..

పని ఒత్తిడి కారణంగా నిరంతరం తనిఖీలను నిర్వహించలేకపోతున్నామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ కార్యాలయం పరిధిలోని సంబంధిత అధికారులు అంటున్నారు. దీంతో మటన్, చికెన్, ఎద్దు మాంసం తదితర వ్యాపారులు తమ వినియోగదారులకు తక్కువ మైక్రాన్లు గల ప్లాస్టిక్ కవర్లను మాత్రమే అందజేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ బ్యాగులను వినియోగించే దుకాణదారులు, ఇతర సంస్థలపై నిఘాను ముమ్మరం చేసి ప్లాస్టిక్ నిషేధం అమలును సంబంధిత అధికారులు పట్టించుకోవాలని పాతబస్తీ ప్రజలు, పర్యావరణ పరిరక్షణ వేత్తలు కోరుతున్నారు.

లింగాయత్ సమాజ్ సంక్షేమానికి ప్రభుత్వం కృషి



సమాజ్ సమావేశంలో పాల్గొన్న ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ తదితరులు

అబిడ్స్: లింగాయత్ సమాజ్ సంక్షేమానికి, వారి అభివృద్ధికి సీఎం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. లింగాయత్ సమాజ్‌కు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉండి అన్నివర్గాల, అన్నివిధాల సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఆదివారం గోషామహల్ నుంచి ఎగ్జిబిషన్ వరకు లింగాయత్ సమాజ్‌వారు పెద్ద ఎత్తున ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శను నందకిశోర్ వ్యాస్ బిలాల్ ప్రారంభించి వారికి సంఘీభావం ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో వేలాది మంది లింగాయత్ సమాజ్ వారు ఉన్నారని, వారితో పాటు గ్రేటర్ నలుమూలలా లింగాయత్ సమాజ్ వారంతా తమ దృష్టికి వారి సమస్యలు తెస్తే వెంటనే ఆయా ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. లింగాయత్ సమాజ్‌కు తాను అండగా ఉండి వారి కష్ట సుఖాలో పాలుపంచుకునేందుకు వారి వెంటే ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు పూజ వ్యాస్ బిలాల్, పరమేశ్వరీ సింగ్, ఆనంద్‌సింగ్, రేణుకా లింగాయత్, పుష్ప, కోటి శైలేష్ కురుమ, ఈషా, సునిల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గో సంరణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి



కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్‌యాదవ్ తదితరులు

అబిడ్స్: గో సంరణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. గో ఉత్పత్తులు పెంపొందించేందుకు, గోవులను సంరక్షించేందుకు తాను ఎళ్లవేళల ముందుంటానని ఆయన అన్నారు. సీతారామ్‌బాగ్ ద్రౌపతి గార్డెన్‌లో మార్వాడి సమాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఏక్ శ్యామ్-గోమాతకా నామ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మార్వాడి సమాజ్ హైదరాబాద్ వారు గో సంరక్షణకు ఇలాంటి మహోన్నత కార్యక్రమాలు నిర్వహించడం గర్వకారణమన్నారు. గోమాతను పూజిస్తే మనిషికి ఎంతో ముక్తి లభిస్తుందన్నారు. గో ఉత్పత్తులు పెంపొందించేందుకు అన్ని సమాజ్‌లవారు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు



నాంపల్లి: ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను పబ్లిక్‌గార్డెన్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పబ్లిక్ గార్డెన్స్‌లో అవగాహన సదస్సును చేపట్టారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయవాది గులామ్ యాజ్దాని, సుజాత హైస్కూల్ చైర్మన్ జయ ప్రకాష్ సింగ్, పబ్లిక్ గార్డెన్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మణిలాల్ షా, ఏబీసీ లాఫింగ్ క్లబ్ సభ్యులు సర్వర్ పాషా, మహ్మద్ వాహెబ్, సామాజిక కార్యకర్త మహ్మద్ అబిద్ అలీ, రిటైర్డ్ కల్నల్ బి.త్రివేది, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మాజిద్, రయీస్ ఖాన్, బుష్రా ఫాతిమా హాజరై ప్రసంగించారు. నగరంలోని పార్కులు, చెరువులు సుందరీకరణకు నోచుకోవడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. చారిత్రాత్మకమైన పబ్లిక్‌గార్డెన్స్‌లో కొలను, ఫౌంటేన్లు, లాన్లు పూర్తిగా ధ్వంసమైనట్లు చెప్పారు. ప్రభుత్వాలు పార్కులపై ప్రత్యేక దృష్టిసారించి కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.

పురస్కారాల ప్రదానం



అవార్డు గ్రహీతలతో వేణుగోపాల చారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలంగాణ నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్.వేణుగోపాల చారి అన్నారు. ఆదివారం సారస్వత పరిషత్‌లో శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి ప్రైడ్ ఆఫ్ తెలంగాణ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటకశాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, టీవీ ప్రొడ్యూసర్ కౌన్సిల్ అధ్యక్షుడు మహ్మద్ షరీఫ్, టీవీ నటుడు లోహిత్‌కుమార్, సంస్థ నిర్వాహకుడు జి.కృష్ణ పాల్గొన్నారు.

కథా తిలకం గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి

సుల్తాన్‌బజార్: సాహితీ భారతికి నుదుట దిద్దిన తిలకంలా కథా తిలకం గ్రంథం ఉందని తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి అన్నారు. ఆదివారం రాత్రి సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణ దేవారాయ తెలుగు భాషా నిలయంలో నవ్య సాహితీ సమితి నిర్వహణలో జరిగిన ప్రముఖ రచయిత కుంతిపురం కౌడిన్య తిలక్ రచించిన కథా తిలకం గ్రంథావిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా కేవీ రమణాచారి హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. కథా తిలకం గ్రంథంలో గాఢత, సాంద్రత వస్తు వైవిధ్యంతో పాటుగా రచయిత కథా కథనం చాలా గొప్పగా ఉందన్నారు. డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, నవోదయ విద్యాలయాల సంస్థల డిప్యూటీ కమిషనర్ గోపాల కృష్ణ, దత్తాత్రేయ శర్మ, జానకి, శైలజ, విజయ్‌కుమార్, లక్ష్మీమానస, హరినాథ్‌బాబు పాల్గొన్నారు.

గోల్కొండ కోట కిటకిట

గోల్కొండ: గోల్కొండ కోట పర్యాటకులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవు రోజు కావడంతో పెద్ద సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. ముఖ్యంగా కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు కోటను సందర్శించడానికి తరలివచ్చారు. కాగా కోటలోని రాణి మహల్ అందాలు వీక్షిస్తూ పర్యాటకులు ఎంతో ఆశ్చర్యానికి లోనయ్యారు. యువ జంటలు, విద్యార్థులు కోటలోని ఫిరంగుల వద్ద సెల్ఫీలు దిగుతూ సంబరపడ్డారు.



పోలీస్ విధుల పట్ల అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మోజంఖాన్

చాంద్రాయణగుట్ట: ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థతో తెలంగాణ పోలీసులు ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నారని బహదూర్‌పురా ఎమ్మెల్యే మోజంఖాన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే, స్థానిక పాఠశాలల చిన్నారులకు ఏసీపీ షేక్ జహంగీర్ పోలీస్ విధులను వివరించారు. నేరాల నివారణ కోసం సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు సైబర్ క్రైమ్స్‌పై వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

గోల్కొండ: కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడపిల్లలకు వరంలాంటిదని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన కార్వాన్‌లోని ఏకే ఫంక్షన్‌హాల్‌లో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పథకం ప్రవేశపెట్టి ఎన్నో సంవత్సరాలు అయిందని, అయితే నేటికీ ఈ విషయం చాలా మంది పేదలకు తెలియదని ఆయన అన్నారు. మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు ఈ పథకాలపై పేదల బస్తీల్లో ప్రచారం నిర్వహించి ఎందరికో అవగాహన కల్పించడం జరిగిందన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకీ కార్పొరేటర్ ప్రతినిధి ఆరూన్‌ఫరాన్ తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చార్మినార్: డబీర్‌పురా గాంధీ మెమోరియల్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 1996–97 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు, టీచర్లు అధిక సంఖ్యలో పాల్గొని ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అందరూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పూర్వ విద్యార్థులందరూ ఆనాటి టీచర్లకు శాలువాలు కప్పి పూల మాలలతో ఘనంగా సత్కరించారు.

రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడి ఆత్మహత్య

నాంపల్లి: జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన నాంపల్లి జీఆర్పీ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రకృతి చికిత్సాలయం-ఫతేనగర్ రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. 30 ఏళ్ల ఓ గుర్తు తెలియని యువకుడు గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. శవ పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించి భద్రపరిచారు. మృతుడి ఒంటిపైన బిస్కెట్ రంగు కలిగిన గళ్ల చొక్కా, నీలం రంగు నిక్కర్ ధరించినట్లు పోలీసులు తెలిపారు.

ఓపెన్ హౌస్ కార్యక్రమం ద్వారా పోలీస్ విధుల అవగాహన



పోలీస్ విధులను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కౌసర్, డీసీపీ కిరణ్ ఖారే

జియాగూడ: ఓపెన్ హౌస్ కార్యక్రమం ద్వారా పోలీసులు నిర్వహించే బాధ్యతలను ప్రజలకు వివరించడం హర్షణీయమని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఈ మేరకు ఆదివారం కుల్సుంపురా పోలీస్‌స్టేషన్‌లో తెలంగాణ అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ సురక్ష దినోత్సవ కార్యక్రమం ఏర్పాటైంది. ముఖ్య అతిథిగా హాజరైన కౌసర్ మొహియుద్దీన్, సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్ ఖారే ఓపెన్‌హౌస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసులు పోలీస్‌స్టేషన్‌లోని ఆయుధాల పనితీరు గురించి వివరించారు. విధులు, అధికారాల గురించి హౌస్‌కు హాజరైన వారికి వివరించారు. ప్రజలు పోలీస్‌స్టేషన్‌లో ఎలా ఫిర్యాదు చేయాలి, ఆయుధాలను ఎలా ఉపయోగిస్తారు, ఎప్పుడు వాడాలన్న విషయాలను పోలీసు సిబ్బంది తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రహ్మత్‌బేగ్, కార్వాన్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జ్ అమర్‌సింగ్, బీఆర్‌ఎస్ కార్యవర్గ సభ్యుడు కావూరి వెంకటేష్, నర్మద, పోలీస్‌స్టేషన్ పరిధిలోని బస్తీ కమిటీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి పీఎస్‌లో సురక్షా దినోత్సవం



సురక్షా దినోత్సవంలో ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెజార్

నాంపల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నాంపల్లి శాంతిభద్రతల పోలీసు స్టేషన్‌లో సురక్షా దినోత్సవాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా పోలీసులు ఓపెన్ హౌస్ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సైఫాబాదు డివిజన్ ఏసీపీ సంజయ్‌కుమార్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ఇక్బాల్ షాప్ అలీ, నాంపల్లి ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్‌తో పాటుగా సంఘ సేవకులు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకోవడానికే ప్రజా దర్బార్



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి ప్రతి వారం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకీ మిరాజ్‌కాలనీలోని ఆయన కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా దర్బార్ కార్యక్రమానికి మంచి స్పందన వస్తుందని, ఈ వేదిక ద్వారా ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తెస్తున్నారన్నారు. అంతే కాకుండా అధికారులు సైతం పని దినాల్లో ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారన్నారు. దీని ద్వారా అధికారులు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని ఆయన అన్నారు. ముఖ్యంగా ఈ వేదిక ద్వారా తనకు వీధి లైట్ల నిర్వహణ, తాగునీటి సమస్యలు, డ్రైనేజీలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని కేవలం రెండు రోజుల్లోనే ఆ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్‌నజీరుద్దీన్, నాయకులు ఆలీమ్, హబీబ్ తదితరులున్నారు.

గోషామహల్ నలుమూలలా విద్యార్థులకు ఉచిత విద్య



పూసలబస్తీ గోడేకబర్ వారికి అడ్మిషన్లు జారీ చేస్తున్న గడ్డం శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నట్లు నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని బస్తీలు, మురికివాడలు, ఇతర ప్రాంతాల విద్యార్థులకు ఇంటర్, డిగ్రీ, పీజీ కోర్సుల విద్యను తాను స్వయంగా ఫీజులు చెల్లించి విద్యనందిస్తానన్నారు. పూసలబస్తీ, గోడేకబర్ ప్రాంతాల్లో విద్యార్థులకు ఉచిత అడ్మిషన్లు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి ఐఏఎస్, ఐపీఎస్‌లు అయ్యే విధంగా తనవంతు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో విద్యార్థులు ఎవరైనా ఉచితంగా ఇంటర్, డిగ్రీ, పీజీ విద్య కావాలంటే తనను సంప్రదించాలని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



మాజీ లోక్‌సభ స్పీకర్ మీరాకుమారిని కలిసిన ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: హైదరాబాద్‌లో బాబూ జగ్జీవన్‌రామ్, మహాత్మా జ్యోతిరావు పూలే 125 అడుగుల విగ్రహాలను నెలకొల్పాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆదివారం మాజీ లోక్‌సభ స్పీకర్ మీరాకుమారిని కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజల కోసం అనేక సంస్కరణలు చేసిన మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయాల్సి అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయలక్ష్మి, బాబూ జగ్జీవన్ సమతా మూమెంట్ నిర్వాహకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీఆర్‌ఎస్ కనుమరుగు



బీజేపీ నాయకులతో దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ కనుమరుగు కావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన గోల్కొండ కోటలో గత వారం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థుల చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన ఏ ఒక్క వ్యక్తి వల్లనో, ఏ ఒక్క రాజకీయ పార్టీ వల్లనో రాలేదని, ఎందరో పోరాట యోధుల బలిదానాల వల్లే రాష్ట్ర సాధన సాధ్యమైందన్నారు. అయితే నేడు తెలంగాణలో బీఆర్‌ఎస్ నాయకులు తమ వల్లే రాష్ట్ర సాధన సాధ్యమైందని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, ఇంద్రసేనారెడ్డి, ఆశ్విన్‌మోదీ, దేవర వంశీ తదితరులున్నారు.

భవానీనగర్ పీఎస్‌లో విద్యార్థులతో ‘ఓపెన్ హౌస్’



గౌలిపురా: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భవానీనగర్ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులతో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భవానీనగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ అంజద్ అలీ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు పోలీసుల పనితీరు, విధి నిర్వహణ, ఎఫ్ఐఆర్ నమోదు, తుపాకుల వినియోగం, బందోబస్తు, కేసుల పరిష్కారం తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దామోదర్, ఏఎస్సై జాఫర్, కానిస్టేబుల్ వెంకటప్ప, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 14 మందిపై కేసు

అబిడ్స్: మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి న్యాయస్థానాలు జైలు శిక్షలు విధిస్తున్నాయని అబిడ్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వర్మ పేర్కొన్నారు. అబిడ్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 14 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వర్మ తెలిపారు. 10 మంది వాహనదారులకు రూ.2,100 జరిమానాను కోర్టు విధించినట్లు తెలిపారు. ఒక వాహనదారుడికి ఐదు రోజుల జైలు శిక్ష, రూ.3300 జరిమానా, మరో వ్యక్తికి రూ.300 జరిమానా, ఏడు రోజుల జైలు శిక్ష, మరో వ్యక్తికి రూ.2100 జరిమానాతో పాటు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. మరో వాహనదారుడికి మద్యం శాతం ఎక్కువగా ఉండడంతో పాటు గతంలో పలుమార్లు కూడా మద్యం సేవించి వాహనం నడిపినందువల్ల అతనికి రూ.3300 జరిమానాతో పాటు 6 నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వర్మ తెలిపారు.